


బాలల
సెప్టెంబరు 2016
బొమ్మరిల్లు
రూ. 20/-
V.KrishnaMohan
శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి
అద్భుత సీరియల్
విచిత్ర మహల్

# వ్యక్తిత్వం

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు



రాజు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంచి పిల్లాడని పేరుంది. చక్కగా చదువుతాడు.

ఆరోజు కాస్త ఆలస్యంగా క్లాస్‌కి వచ్చాడు. క్లాస్ టీచర్ రాఘవమూర్తి రాజు అరచేతుల మీద గట్టిగా దెబ్బలు వేసి క్లాస్‌లోకి రానిచ్చారు.

గంట తర్వాత హఠాత్తుగా డి.ఇ.ఓ. గారు చెకింగ్‌కి వచ్చారు. క్లాస్‌రూంని, పిల్లల్నీ శ్రద్ధగా పరిశీలిస్తూ, రాజును చూసి ఆశ్చర్యంగా "ఇలారా బాబూ" అని పిలిచి క్లాస్ టీచర్‌కు చూపిస్తూ "ఇందాక నా కారు బజారు రోడ్డు మీద ఆగిపోయి చాలా ఇబ్బంది పెట్టింది. దాన్ని తోసి పక్కగా పెడదామని ఎంతమందిని సహాయం కోసం పిలిచినా రాలేదు. అప్పుడు ఈ పిల్లవాడు వచ్చి ఎంతో సహాయం చేశాడు. మెకానిక్‌ను కూడా తీసుకువచ్చాడు. ఇతను గనుక సమయానికి రాకపోయుంటే ఇవాళ్టి ఈ తనిఖీతో పనులన్నీ ఆగిపోయేవి. అక్కడ నీకు థాంక్స్ చెప్పేలోగా వెళ్ళిపోయావు. ఇప్పుడు చెబుతున్నాను" అన్నారు ఆప్యాయంగా రాజుకి షేక్‌హ్యాండ్ ఇస్తూ...

అదంతా ఆశ్చర్యంగా విన్న రాఘవమూర్తి "ఒరే రాజు, ఇందాక

నువ్వు క్లాస్‌కి లేట్‌గా రావడానికి కారణం ఇదని చెప్పుంటే నేను నిన్నుకొట్టేవాడిని కాదు కదా!" అన్నాడు బాధగా.

"మీరు చేసింది కరెక్టేనండి సార్. సహాయం చేయడమన్నది నా ఆటిట్యూడ్. కానీ స్కూలుకి సమయానికి రావటమన్నది డిసిప్లిన్. క్రమశిక్షణ తప్పాను కాబట్టి నాకు శిక్ష పడాల్సిందే. మీరు కొట్టినందుకు నాకు బాధేం లేదు సార్" అన్నాడు రాజు.

అదివిని డి.ఇ.ఓ "చూశారా గాంధీలు, వివేకనందలు ఈ పిల్లల్లో కూడా ఉంటారు. పెద్దవాళ్ళు సైతం కష్టంలో వున్న సాటి వాళ్ళకు సహాయం చెయ్యరు. ఆఫీసులకు ఆలస్యంగా వస్తూ రకరకాల పనికిమాలిన కారణాలు చెబుతారు. పిల్లాడిగా వున్నప్పుడే పరిమళిస్తున్నాడు. వజ్రంలా ప్రకాశిస్తున్నాడు. ఇలాంటి పిల్లాడు వున్న ఈ తరగతిని ఇహ పరిశీలించనక్కర్లేదు. ఐ ప్రౌడ్ ఆఫ్ రాజు'' అని వెళ్ళిపోయారు.

"మీరందరూ కూడా ఇలా రాజులా వ్యక్తిత్వంతో ప్రకాశించాలి" అని పిల్లలతో పాఠం చెప్పడం ప్రారంభించారు మాష్టారు.

# అరటిపండు

అవ్వ మాటవినరా బుజ్జికన్నా
బువ్వ కాస్త తినరా చిట్టినాన్న
నింగిలోన చందమామ
తొంగి తొంగి చూసినాది
నీటిలోన కలువభామ
నిన్నుచూసి నవ్వినాది
అల్లరేల? ఆగడమేల?
అమ్మతోన జగడమేల?
కమ్మనైన కథలు వింటూ
గుమ్మపాల బువ్వతింటూ
నిదురపోతే నీకు మేలు
ముద్ద,ముద్దకూ మారాం చెయ్యకు
ముద్దకు ముద్దు బదులిస్తాలే
బుంగమూతితో వెక్కిరించకు
బుద్ధిగ ఉంటే చక్కెర ఇస్తా
చక్కిలిగింతల ఉక్కిరిబిక్కిరి
చేయిస్తాలే... ఆడిస్తాలే
ఆటలోన అరటి పండు
ఒలిచిస్తాలే.... తినిపిస్తాలే

- బండారు చిన్నరామారావు,
లోగీశ